క్లుప్తంగా

వెండి తాపడం తయారీకి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో అంకమ్మవారి ఉపాలయం వెండి తాపడం తయారీకి పెనుగంచిప్రోలుకు చెందిన గరికపాటి శ్రీనివాసరావు, మాధవి దంపతుల కుమారుడు సాయిసాకేత్‌బాబు రూ.11,516 విరాళం ఇచ్చారు. ఈమేరకు నగదును ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం, కొత్తగూడెం పట్టణానికి చెందిన తోకల రవి దంపతులు రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలలో గురువారం ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ డీఈ వి.రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ మండలం చందాపురం సమీపంలో సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున నందిగామ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలు, చందర్లపాడు, వీరులపాడు మండలాల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం ఆరు నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు : ఏసీపీ



నందిగామ: ఘర్షణలకు పాల్పడేవారిపై కఠినవ చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఎన్నికల స్పెషల్ ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ హెచ్చరించారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల వివాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో నందిగామలోని డివిఆర్ కాలనీలో బుధవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా స్పెషల్ ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ప్రజలు ఒకరికొకరు స్నేహభావంతో ఉండాలన్నారు. గుంపులు గుంపులుగా ఒకచోట చేరి అనవసర రాజకీయచర్చలు పెట్టవద్దని సూచించారు. ఎవరైనా వివాదాలకు పోతే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నందిగామ ఇన్‌స్పెక్టర్ హనీఫ్, ఎస్ఐలు పండు దొర, దుర్గా మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీకి విద్యుత్ సదుపాయం



జగన్నాథపురం(వీరులపాడు):మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని జగనన్న కాలనీకి అధికారులు విద్యుత్ సదుపాయం కల్పించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలోని ఇళ్లస్థలాలు లేని 20మంది పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లస్థలాలతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేసింది. దీంతో లబ్ధిదారులంతా ఇళ్లనిర్మాణం చేసుకోగా, ఒకరిద్దరి లబ్ధిదారుల గృహాల నిర్మాణాలు తుదిదశలో ఉన్నాయి. ఈ జగనన్న కాలనీకి అధికారులు బోర్లు, మంచినీటి వసతి, కుళాయి కనెక్షన్, రోడ్లు వసతి కల్పించారు. ప్రత్యేకంగా విద్యుత్ స్తంభాలు చేసి విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో కాలనీకి అన్నివసతులు సమకూరాయి. సీఎం జగమోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ జగనన్న కాలనీలకు అన్ని వసతులు కల్పించడం ద్వారా ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందంటూ లబ్ధిదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఓటెత్తిన చైతన్యం

పెనుగంచిప్రోలు: ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రజాచైతన్యం వెల్లువిరిసింది. పెనుగంచిప్రోలు మండలంలో 90.80 శాతం ఓటింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 41,815 మంది ఓటర్లు ఉండగా 35,967 ఓట్లు పోలయ్యాయి. ఓటుహక్కు వినియోగించుకున్నవారిలో పురుషులు 18,277మంది ఉండగా, మహిళలు 19,969 మంది ఉన్నారు. పోలింగ్ ఉదయం ఏడుగంటలకు ప్రారంభించగా, ఆరుగంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరారు. పోలింగ్ గడువు సాయంత్రం ఆరుగంటలకు ముగియగా, ఆసమయంలోగా పోలింగ్ కేంద్రాలకు వచ్చినవారందరికీ ఎన్నికల సిబ్బంది ఓటేసేందుకు అవకాశం ఇచ్చారు. ఓటర్లు సైతం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి ఓటేశారు. దీంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకు పోలింగ్ జరిగింది. మండలంలో మొత్తం



అనిగండ్లపాడులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

44పోలింగ్ కేంద్రాలు ఉండగా, 30కేంద్రాల్లో 90శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. మండలంలోని సుబ్బాయగూడెంలో ఉన్న 200నంబరు పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 96.36శాతం పోలింగ్ నమోదుకాగా, పెనుగంచిప్రోలులోని 178నంబరు పోలింగ్ కేంద్రంలో అతితక్కువగా 82.40శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారవర్గాలు వెల్లడించాయి.

పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల వివరాలు..

పోలింగ్ కేంద్రం	గ్రామం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	పోలింగ్ కేంద్రం	గ్రామం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
160	శివాపురం	720	665	92.36	182	ముండ్లపాడు	964	907	94.09
161	శివాపురం	742	704	94.88	183	ముండ్లపాడు	761	712	93.56
162	అనిగండ్లపాడు	1144	1025	89.60	184	ముండ్లపాడు	820	768	93.66
163	అనిగండ్లపాడు	1085	967	89.12	185	కొణకంచి	847	775	91.50
164	అనిగండ్లపాడు	1186	1054	88.87	186	కొణకంచి	794	752	94.71
165	అనిగండ్లపాడు	1014	911	89.84	187	కొణకంచి	904	840	92.92
166	అనిగండ్లపాడు	1115	1008	90.40	188	నవాబుపేట	1012	924	91.30
167	ముచ్చింతాల	1063	981	90.58	189	నవాబుపేట	1026	949	92.50
168	ముచ్చింతాల	1005	927	92.24	190	నవాబుపేట	1002	902	90.02
169	లింగగూడెం	689	651	94.48	191	నవాబుపేట	983	918	93.39
170	లింగగూడెం	825	781	94.67	192	తోటచర్ల	812	749	92.24
171	పెనుగంచిప్రోలు	1119	991	88.56	193	తోటచర్ల	762	733	96.19
172	పెనుగంచిప్రోలు	1117	979	87.65	194	శనగపాడు	970	886	91.34
173	పెనుగంచిప్రోలు	1027	889	86.56	195	శనగపాడు	989	929	93.93
174	పెనుగంచిప్రోలు	856	750	87.62	196	వెంగనాయకునిపాలెం	1016	921	90.65
175	పెనుగంచిప్రోలు	919	829	90.21	197	వెంకటాపురం	1123	1026	91.36
176	పెనుగంచిప్రోలు	829	737	88.90	198	కొల్లికుళ్ల	1084	1030	95.02
177	పెనుగంచిప్రోలు	1108	960	86.64	199	సుబ్బాయిగూడెం	715	674	94.27
178	పెనుగంచిప్రోలు	1017	838	82.40	200	సుబ్బాయిగూడెం	604	582	96.36
179	పెనుగంచిప్రోలు	1055	874	82.84	201	గుమ్మడిదుర్రు	1017	959	95.28
180	పెనుగంచిప్రోలు	1173	992	84.57	202	గుమ్మడిదుర్రు	848	783	92.92
181	పెనుగంచిప్రోలు	1184	1012	85.47	203	గుమ్మడిదుర్రు	750	708	94.40
						మొత్తం	41,815	35,967	90.80

గుబులు రేపుతున్న పోలింగ్ శాతం

- ప్రధాన పోటీ వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్యే
- విజయంపై ధీమాలో అభ్యర్థులు



ఓటు వేసేందుకు భారీగా క్యూలో నిలబడిన మహిళలు (ఫైల్)

నందిగామ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నందిగామ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలో నిక్షిప్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఓటరు చైతన్యవంతమై ఓటు వేయడం ఓ మంచి పరిణామానికి నాందిగా నిలిస్తే, ఆయాపార్టీల నేతల్లో మాత్రం గుబులు రేపుతోంది. నందిగామ నియోజకవర్గంలో 87.56శాతం పోలింగ్ నమోదైంది. కొన్నిచోట్ల పలు కారణాలతో పోలింగ్ ఆలస్యమైనప్పటికీ, ఓటర్లు ఓపిగ్గా నిరీక్షించి మరీ ఓటు వేశారు. భారీగా నమోదైన ఓటింగ్‌పై ఎవరి అంచనాలు వారికి ఉన్నాయి. గెలుపోటములపై లెక్కలు వేసుకోవడంలో నాయకులు తలమునకలవుతున్నారు. ఎన్నికలు ముగిసిన రెండు రోజుల వరకు స్తబ్ధుగా ఉన్న ఆయా రాజకీయ పక్షాల మద్దతుదారులు పలువురు ప్రస్తుతం బెట్టింగ్‌లపై దృష్టి సారించారు. అయితే నియోజకవర్గంలో గెలుపుపై మాత్రమే ప్రస్తుతం పందేలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. మెజారిటీలపై పందేలు కాసేందుకు చాలా మంది విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అన్నివర్గాల వారు ఈసారి ఓటు వేసేందుకు ఆసక్తి చూపిన వేళ ఎవరికి ఎంత మెజారిటీ వస్తుందనే విషయాన్ని అంచనా వేయలేకపోతున్నారు.

ఉత్సాహంతో ఓటు వేసిన యువత, మహిళలు, వృద్ధులు

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఓటర్లు ఆయా పార్టీల అభ్యర్థులను కలవరపాటుకు గురిచేశారు. గతంలో పోలింగ్ సరళి ఆధారంగా విజయంపై ఆయా పార్టీల అభ్యర్థులు ఓ అంచనాకు వచ్చేవారు. అయితే, ఈసారి మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా అన్నివర్గాల వారు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం అభ్యర్థులను గందరగోళపరుస్తోంది. యువకులతో పోటీగా వృద్ధులు, మహిళలు భారీసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటుహక్కు వినియోగించుకోవడంతో అభ్యర్థులు తమ విజయంపై ఓ అంచనాకు రాలేకపోతున్నారు. గెలుపు మాదంటే, మాదనే ధీమా వ్యక్తం చేస్తున్నా, అంతర్గతంగా మాత్రం ఏం జరుగుతుందోనన్న కలవరపాటు అనుక్షణం వారిని వెన్నాడుతూనే ఉంది.

పెరిగిన పోలింగ్ శాతం..

ఈసారి ఎన్నికలలో నమోదైన పోలింగ్‌శాతం అభ్యర్థులలో గుబులు రేపుతోంది. ముఖ్యంగా ఎన్నడూ లేని విధంగా వృద్ధులు సైతం కొందరు హోమ్ ఓటింగ్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోగా మిగిలిన వారు క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి ఓటువేసేందుకు కూడా వెనకాడలేదు. పురుష ఓటర్లకు పోటీగా ఉదయం నుంచి రాత్రి వరకు మహిళా ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద గంటల కొద్దీ క్యూలైన్లలో వేచిఉండి ఓటువేశారు. దీంతో అభ్యర్థులు ఎవరికివారు మాకే ఎక్కువ ఓట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ సరళి చూసిన ఎన్నికల విశ్లేషకులు ప్రజలు సంక్షేమానికే పెద్దపేట వేశారని చెబుతున్నారు. ఆ ఓట్లు ఎవరికి మేలు చేస్తాయి అన్న సంగతి తెలియాల్సి ఉంది. ముఖ్యంగా నియోజకవర్గంలో 38,191మంది వృద్ధులు ఉండగా వారిలో సైతం దాదాపు 80శాతం మంది వరకు ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. నందిగామ పట్టణ పరిధిలో పురుషఓటర్లు 88.10శాతం మంది, మహిళా ఓటర్లు 85.04శాతం మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నందిగామ మండల పరిధిలోని గ్రామాల్లో పురుషులు 81.05శాతం మంది, మహిళా ఓటర్లు 80.70శాతం మంది ఓటేశారు. చందర్లపాడు మండలంలో పురుషులు 89.70శాతం, మహిళలు 88.50శాతం, కంచికచర్ల మండలంలో పురుషులు 88.50శాతం, మహిళలు 88శాతం మంది, వీరులపాడు మండలంలో పురుషులు 90.90శాతం, మహిళలు 88.50శాతం మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో థర్డ్ జెండర్ ఓటర్లు ఆరుగురు ఉండగా, నలుగురు ఓటేశారు. మొత్తమ్మీద నియోజకవర్గంలో ఈసారి గతంలో కంటే అత్యధికశాతం పోలింగ్ నమోదైంది.

కుటుంబసభ్యులతో సరదాగా..



కుటుంబసభ్యులతో కలిసి సరదగా గడుపుతున్న ఉదయభాను

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దాదాపు రెండు నెలలుగా రాజకీయాలతో బిజీబిజీగా గడిపిన విప్, వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే అభ్యర్థి సామినేని ఉదయభాను బుధవారం తన కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడుపుతూ సేదతీరారు. మార్చి 16వ తేదీ తర్వాత ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో సభలు, సమావేశాలు, రోడ్‌షోలు, ఇంటింటా ప్రచారాలు, కార్యకర్తలు, నాయకులతో సమీక్షలు ఇలా రోజూ ఉదయం లేచింది మొదలు అర్ధరాత్రి వరకు తీరిక లేకుండా గడిపిన ఉదయభాను ఈనెల 13వ తేదీన పోలింగ్ పూర్తికావడంతో రిలాక్స్ అయ్యారు. ఈక్రమంలో బుధవారం తన మనుమడు అయాన్ పుట్టినరోజు వేడుకల్లో కుటుంబసభ్యులతో కలసి పాల్గొని సరదాగా గడిపారు.

- జగ్గయ్యపేట అర్బన్

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



డాక్టర్ ఆళ్ల హరీష్

జగ్గయ్యపేట అర్బన్: రోజురోజుకు రికార్డు స్థాయిలో వేసవి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నందున గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని జగ్గయ్యపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆళ్ల హరీష్ సూచించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత కొద్దిరోజులుగా 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్నారు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతోందని, చిన్న పిల్లలతో ప్రయాణం చేసేటపుడు ఎండ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎండల కారణంగా శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటకు పోతోందని, దీంతో నీరసం వస్తుందన్నారు. నిమ్మరసం, ఫ్లూయిడ్స్ వంటివి తరచూ తాగడం ద్వారా నీరసం బారినపడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. డీహైడ్రేషన్, డయేరియా వంటి వ్యాధుల బారిన పడిన వెంటనే సంబంధిత ఆశా వర్కర్ల ద్వారా సమాచారం తెలియజేయాలన్నారు. పట్టణంలో ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ హెల్త్ సెంటర్లలో అవసరమైన మందులు, ఆధునిక పరికరాలతో కూడిన ల్యాబ్‌లు ఉన్నాయన్నారు. ఎటువంటి పరీక్షలు చేయించుకోవాలన్నా సీహెచ్‌సీని సంప్రదించాలని ప్రజలకు సూచించారు.

వైభవంగా త్యాగరాజస్వామి జయంతి ఉత్సవాలు



గాత్ర కచేరీ నిర్వహిస్తున్న మల్లాది కార్తీక త్రివేణి

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సద్గురు త్యాగరాజ స్వామి 257 జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు పాల్గొని త్యాగరాజ స్వామి పట్ల తమకున్న అభిమానం చాటుకున్నారు. బుధవారం నాటి సంగీతోత్సవంలో సాయి రాధాకృష్ణ గాత్ర కచేరితో ప్రారంభమయ్యాయి. తేజశ్రీ. ఓరుగంటి లక్ష్మి, పి.జయతి, మహతి, లక్ష్మీ శర్వాణి, ఆర్.పద్మశ్రీ, ఎస్.సాత్విక, చెంగల్వ రజని, గండూరి నాగేశ్వర శర్మ, యనమండ్ర శ్రీనివాస శర్మ, మల్లాది కార్తీక త్రివేణి, ధూళిపాల వాసవి త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలు ఆలపించారు. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, ఎన్‌సీహెచ్ బుచ్చాయ్యాచార్యులు, గాయత్రీ గౌరీనాథ్ పాల్గొన్నారు. శ్రీ సద్గురు సంగీత సభ ప్రధాన కార్యదర్శి గౌరీనాథ్, ఉపాధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ఉపాధ్యక్షుడు బి.హరిప్రసాద్, కోశాధికారి వీఆర్ సుబ్రహ్మణ్యం నిర్వహించారు.

తారురోడ్లు... తళతళ



అనిగండ్లపాడు-శివాపురం తారురోడ్డు



గుమ్మడిదూర్రు-అనిగండ్లపాడు రోడ్డు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని రహదారులు నేడు తళతళలాడుతున్నాయి. నియోజకవర్గంలో దశాబ్దాలుగా నిరాదరణకు గురైన రోడ్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను హయాంలో నూతనరూపును సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి సంక్షేమంతోపాటు అభివృద్ధిలో భాగంగా ప్రజారవాణాకు పెద్దపీట వేశారు. మండలంలో గట్టుమూల నుంచి వయా గుమ్మడిదూర్రు మీదుగా అనిగండ్లపాడు వరకు రూ.1.20 కోట్లతో తారురోడ్డు నిర్మాణం పూర్తయింది. అదేవిధంగా శివాపురం నుంచి అనిగండ్లపాడు వరకు రూ.కోటితో తారురోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈ రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వవిప్ ఉదయభాను ప్రత్యేకంగా కృషి చేశారు. దీంతో ఆయా గ్రామాల రోడ్లు అభివృద్ధి చెందాయి. దశాబ్దాలుగా అధ్వానంగా ఉన్న రోడ్లు అభివృద్ధి చెందడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

18 నుంచి తిరు కల్యాణోత్సవం

మైలవరం: ద్వారకా తిరుమలలోని వేంకటేశ్వర స్వామి వారి వైశాఖ మాస తిరు కల్యాణోత్సవాలు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న స్వామివారి కల్యాణం, 23న రథోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించాలని కోరారు.

మురుగునీటిలో మంచినీటి కొళాయి



కంచికచర్ల : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కొళాయి వద్ద మురుగు నీరు నిల్వ ఉండటంతో ఆ మురుగంతా తిరిగి మంచినీటి పైపుల్లోకి చేరుతోంది. దీంతో కొళాయి ద్వారా వచ్చే నీరు కలుషితంగా ఉంటుండటంతో ఈనీటిని తాగలేక స్టేషన్‌ను సందర్శించే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. దీంతో బయట ఉన్న దుకాణాల్లో మంచినీటి బాటిళ్లను కొనుగోలు చేసి తాగుతున్నారు. పోలీసు అధికారులు స్పందించి స్టేషన్‌లోని కొళాయి వద్ద మురుగునీరు పారుదలకు తగిన చర్యలు తీసుకుని, మురుగునీరు మంచినీటి పైపులైన్‌లోకి చేరకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభమైన పాండురంగడి బ్రహ్మోత్సవాలు



ఎదుర్కోలోత్సవంలో స్వామి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కొత్తగుళ్ల ప్రాంగణంలో కొలువై ఉన్న పాండురంగడి సన్నిధిలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి ఆలయంలో ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఉదయం ఆలయంలోని రుక్మాబాయి సమేత పాండురంగడకు ప్రత్యేక తిరుమంజన అభిషేకాన్ని నిర్వహించారు. అందులో భాగంగా పంచామృతాలు, పలు ఫల, విశేష జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పెండ్లి కుమారునిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం హంసవాహనంపై స్వామి వారికి వాహనసేవను జరిపారు. అనంతరం ఎదుర్కోలోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అందులో భాగంగా శేషవాహనంపై స్వామి వారిని అధిష్టింపజేశారు. అనంతరం స్వామివారు, అమ్మవార్ల గుణగణాలను కీర్తిస్తూ ఉత్సవాన్ని జరిపారు. పాండురంగ భజన మండలి ఆధ్వర్యంలో రాత్రి సంకీర్తన గానం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను అద్దేపల్లి మురళీకృష్ణమాచార్యులు వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.



ఎదుర్కోలోత్సవంలో రుక్మాబాయి అమ్మవారు